క్లుప్తంగా

ఇంటి నుంచే లైఫ్‌సర్టిఫికెట్ సమర్పణ



గుమ్మలక్ష్మీపురంలో పెన్షనర్ ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ సమర్పిస్తున్న హరిప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: పెన్షనర్ల ఇంటి వద్దకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గుడ్ల హరిప్రసాద్, జగన్నాథ రథో తెలిపారు. శనివారం మండలంలోని 85 మంది పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లను తయారు చేసినట్లు చెప్పారు. మిగిలిన పెన్షనర్లతో కూడా లైఫ్ సర్టిఫికెట్లు పూర్తిచేసి వాటిని ట్రెజరీ కార్యాలయంలో అందజేయనున్నట్లు చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి, ఏఈ అఖిల్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, బిల్లు చెల్లింపులపై అవగాహన కల్పించడం ద్వారా నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారుల ఇంటి పట్టాలకు నంబర్ కేటాయించేలా రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్మాణాల పురోగతి, బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు.


రహదారి నిర్మాణానికి భూమిపూజ



ఇజ్జకాయి వద్ద రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: రహదారి సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు ప్రాధాన్యత క్రమంలో రహదారులు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గొయిపాక పంచాయతీ గండపాక నుంచి ఇజ్జకాయి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రూ.5.84 కోట్లతో సుమారు 9 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ చేపట్టనున్నట్లు చెప్పారు. పీఐయూ పర్యవేక్షణలో సకాలంలో పనులు పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, గొయిపాక సర్పంచ్ కారంగి లక్ష్మి, ఎంపీటీసీ కొండగొర్రి కవిత, వైఎస్సార్‌సీపీ నాయకులు, పీఐయూ ఈఈ రాధారాణి, డీఈ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నీలకంఠాపురం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.గోవిందరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రమోహన్, వసతిగృహ సంక్షేమాధికారి పి.మల్లేష్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ పార్వతీపురంలో గత నెల 29న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు కిల్లక లోకేష్, తిమ్మక దీపక్ అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అలాగే విజయనగరంలో గత నెల 27న జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి కిల్లక కుమార్‌రాజు అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరంతా ఈనెల 20 నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

20 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండ గ్రామానికి చెందిన సవర శ్రీను సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు శనివారం తెలిపారు. అతని వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమ పాలనే జగనన్న లక్ష్యం



లాడ గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- 50 సచివాలయాల పరిధిలో 'గడపగడపకు..' పూర్తి

గుమ్మలక్ష్మీపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని మారుమూలన ఉన్న బీరుపాడు గ్రామ సచివాలయం పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి లాడ, శ్రీరంగపాడు, దబ్బలగూడ, బీరుపాడు, కుంతేసు గ్రామాల్లో గడపగడపకు వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కురుపాం నియోజకవర్గంలో మొత్తం 102 గ్రామ సచివాలయాలకు గాను 50 గ్రామ సచివాలయాల పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని పూర్తిచేసినట్లు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తెలిపారు. మిగిలిన సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో కూడా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి విజయోత్సవాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, బీరుపాడు సర్పంచ్ కొండగొర్రి కళావతి, ఎంపీటీసీ కొండగొర్రి కవిత, వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, నాయకులు కృష్ణమూర్తి, ప్రసాంత్, కిల్లక పైడిరాజు, కొండగొర్రి లచ్చయ్య, కిల్లక రాజారావు, తాడంగి ఠాగూర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు..'



కూరాకులవీధిలో వృద్ధుడికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పేర్కొన్నారు. వీరఘట్టం సచివాలయం–1 పరిధిలో ఉన్న కూరాకులవీధి, తెలగవీధి, ముచ్చర్లవీధుల్లో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పార్టీలు, కుల, మత, వర్గాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. కుటుంబంలో చదువుకునే పిల్లలకు అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు, మహిళలకు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ రుణాలు ఇలా లెక్కకు మించి పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా ఆశీర్వచనాలు అందించి అండగా నిలవాలని కోరారు. ప్రతీ గడప వద్ద మహిళలు ఎమ్మెల్యేకు హాజరులు ఇచ్చి స్వాగతం పలికారు. తెలగవీధి వద్ద ఉన్న మల్లమార్తాండ కోడి రామ్మూర్తినాయుడు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ పులిటి గౌరమ్మ, ఎంపీటీసీ కర్రి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, దౌలూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి పూర్తిస్థాయిలో .

ధాన్యం కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

- ఎంపీపీ ఉరిటి రామారావు

గరుగుబిల్లి: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఎంపీపీ ఉరిటి రామారావు వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ కేంద్రాలు తదితర వాటికి సంబంధించి 35 భవనాలు మంజూరుకాగా అందులో 31 భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణాలకు సంబంధించి రూ.86 లక్షల బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు పీఆర్ ఏఈ సభ్యులకు వివరించారు. మండలంలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి అవసరమైన స్థలాలను కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఉపాధిహామీ పథకం ద్వారా వేతనదారులకు రెండు పూటలా పనులు కల్పిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తెలిపారు. ఈనెల నుంచి ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులకు ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా 60 శాతం సబ్సిడీపై సమీకృత దాణా, 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు అసిస్టెంట్ పశు వైద్యులు ఎం.శ్రీరాములునాయుడు తెలిపారు. ఈనెల రేషన్ లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందజేస్తున్నామని సీఎస్‌డీటీ రమణారావు అన్నారు. జగనన్న కాలనీలో మంజూరైన పట్టాలకు నంబర్లు కేటాయించాలని ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు తహసీల్దార్ అజు రఫీజాన్‌ను కోరారు. మూడోవిడత జగనన్న చేయూత పథకం కింద 993 మహిళా సంఘాల్లోని 11,993 మంది సభ్యులకు రూ.5.82 కోట్లు మంజూరయ్యాయని ఏపీఎం పి.అప్పలనాయుడు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటహర్ష

కురుపాం: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని 104 వైద్యాధికారి జి.వెంకటహర్ష అన్నారు. మండలంలోని జి.శివడ గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 40 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిబిరంలో ఎం.ఎల్.హెచ్ శైలజ, హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు సేవలందించారు.

ఇంటర్వ్యూలకు 17 మంది హాజరు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పీఓ నవ్య

సీతంపేట: శ్రీకాకుళం జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగాలకు సీతంపేట ఐటీడీఏలో శనివారం ప్రాజెక్టు అధికారి బి.నవ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 12 పోస్టులకు గాను 17 దరఖాస్తులు రాగా 17 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి, సీడీపీఓ పి.రంగలక్ష్మి అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు.

పాఠశాలల్లో వసతుల పరిశీలన



అన్నవరం పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ డీఈవో తదితరులు

పాలకొండ రూరల్: పీఎం శ్రీ (ప్రధాన మంత్రి పాఠశాలు రేజింగ్ ఇన్ ఇండియా) పాఠశాల ఏర్పాటుపై నిర్దేశిత నిబంధనలకు లోబడి ఉన్న ప్రభుత్వ పాఠశాలల గుర్తింపు ప్రక్రియను పాలకొండ డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారిని విజయకుమారి చేపట్టారు. శనివారం మండలంలోని అన్నవరం, అంపిలి, బడ్డుమాసింగి, పట్టణ పరిధిలో వెంకమ్మపేట ప్రభుత్వ పాఠశాలలను డైట్ ప్రిన్సిపాల్ తిరుమల చైతన్య, ఎంఈఓ ఎం.సూర్యనారాయణతో కలిసి సందర్శించారు. పీఎంశ్రీ పాఠశాలల్లో భాగంగా ఏర్పాటు చేయనున్న డిజిట్ తరగతిగది, అదనపు బోధన భవనం, గ్రంథాలయం, పూర్తిస్థాయి మౌలిక వసతులు ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర అంశాలను హెచ్‌ఎం వద్ద సేకరించారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్‌ను అందజేస్తున్న సర్పంచ్ ఇందుమతి

గరుగుబిల్లి: అర్హులైనవారికి పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని గరుగుబిల్లి గ్రామ సర్పంచ్ కె.ఇందుమతి అన్నారు. గ్రామంలో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు వలంటీర్లతో కలిసి శనివారం పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా..అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ నాయకుల కుటుంబాలకు కూడా పింఛను మంజూరు చేయడమే ఇందుకు నిదర్శమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.రామినాయుడు, ఎస్.శ్రీరాములనాయుడు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బెంతోరియాలను ఎస్టీల్లో చేర్చొద్దు

సీతంపేట: బెంతోరియా, బోయ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని శ్యాముల్ ఆనంద్ కుమార్ కమిషన్‌కు వినతిపత్రం అందజేసినట్టు గిరిజన జేఏసీ రాష్ట్ర నాయకులు బి.తేజేశ్వరరావు, సోమేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం విచ్చేసిన కమిషన్‌ను శుక్రవారం రాత్రి కలిసి పలు అంశాలపై మెమోరాండాన్ని అందించినట్లు పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన అగ్రకులాలను ఎస్టీ జాబితాలో కలిపితే గిరిజనులకు నష్టం జరుగుతుందన్నారు.

నిబంధనలు పాటించాలి

వీరఘట్టం: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై ఎం.హరికృష్ణ సూచించారు. శనివారం స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో ఎంతో మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణం చేస్తుంటారని, వారిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడిపినా, లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేకుండా రాకపోకలు సాగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సచివాలయ సిబ్బంది పనితీరుపై డీఎల్‌డీఓ అసంతృప్తి



సచివాలయం రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

పాలకొండ: సచివాలయ సిబ్బంది పనితీరు మారాలని డీఎల్‌డీఓ వీపీ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని సింగన్నవలస సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సర్వీసులు కనీసం స్థాయిలో కూడా అందించడం లేదని మండిపడ్డారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని, సమయపాలన పాటించాలని, సిటిజన్ చార్ట్ ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించిన బోర్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రదర్శనగా ఉంచాలన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



దోలమడ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని నవగాం, పొట్లి, అవలంగి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. నిబంధనల మేరకు ఆన్‌లైన్ హాజరు కచ్చితంగా అమలు చేయాలన్నారు. వేతనదారులు నిర్దేశిత సమయాల్లో పనులు చేయాలని, సమయపాలన పాటించటం, కొలతల మేరకు పనులు పూర్తి చేయడం ద్వారా గరిష్ట వేతనం పొందవచ్చని సూచించారు. అనంతరం దోలమడ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

కళతప్పిన సంక్రాంతి

- సంక్రాంతి సమీపిస్తున్నా కనిపించని హరిదాసులు, జానపద కళాకారులు
- కనుమరుగవుతున్న గంగిరెద్దుల విన్యాసాలు



గంగిరెద్దులతో సంచారం చేస్తున్న కళాకారుడు

జియ్యమ్మవలస: కళల లోగిలిగా భావించే సంక్రాంతి పండుగ సమీపిస్తున్నా జానపద కళాకారుల జాడ కనిపించడం లేదు. గతంలో సంక్రాంతి వచ్చిందంటే ఇళ్ల ముందు గొబ్బెమ్మలు, రంగవల్లులు, హరిలోరంగ హరి అంటూ హరిదాసులు, అయ్యవారికి దండం పెట్టు, అమ్మవారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దులతో ఆటగాళ్లు చేయించే విన్యాసాలు, శంభోశంకరా అంటూ జంగందేవర్ల సందడి పల్లెల్లో నెలకొనేది. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. తెలుగువారి పెద్ద పండుగ క్రమక్రమంగా కళ తప్పుతోంది. సంక్రాంతి వేళ పల్లెలు బోసిపోతున్నాయి. సమాజిక మాధ్యమాలు, స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్ల రాకతో జానపద కళలకు ఆదరణ తగ్గుతోంది. దీంతో గంగిరెద్దులవారు, హరిదాసులు తదితర కళాకారులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్నారు. ఆయా వర్గాలలోని యువత పరిశ్రమల కార్మికులుగా, ఇతర పనులకు వెళ్తుండగా.., వయసు మీద పడినవారు తరతరాలుగా చేస్తున్న వృత్తిపై మమకారం ఉన్నవారు అరుదుగా గ్రామాలు, పట్టణాల్లో గంగిరెద్దులతో తిరుగుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గంగిరెద్దులాట కళాకారుల పిల్లలు కూడా ఆ కళను కొనసాగించేందుకు ఆసక్తి చూపడం లేదు.

సంక్షేమ పథకాలతో తిరగడం లేదంటూ..

సాధారంగా జానపద కళాకారులు కొందరు స్థానికంగా ఉంటుండగా, మరికొందరు ఊరూరా తిరుగుతూ ప్రదర్శనలు ఇస్తుంటారు. దీంతో వారు స్థానికంగా ఎక్కువ కాలం ఉండలేకపోతుండడంతో ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలకు వారు దూరమవుతున్నారు. ప్రభుత్వం జానపద కళలు, కళాకారులను ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.

నిప్పు.. పొలానికి ముప్పు

- వరి పొలాల్లో వ్యర్థాల నివారణకు మంటలు
- భూసారాన్ని దెబ్బతీస్తున్న రైతుల నిర్ణయం
- భూమి పై పొరల్లో ఉండే మిత్ర పురుగులకు నష్టం



కాలుష్యాన్ని వెదజల్లుతున్న పొగలు



వరి వ్యర్థాలను కాల్చడంతో పొలంలో పేరుకుపోయిన బూడిద

భామిని: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుని, రబీ సీజన్ ప్రారంభమవుతోంది. ఖరీఫ్ వరి చేను కోతలు యంత్రాలతో పూర్తి చేసిన రైతులు వరి పంట వ్యర్థాలకు పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. వ్యవసాయ కూలీలతో కోతలు కోసిన రైతులు పొలాల్లోనే కుప్పలు పెట్టారు. యంత్రాలతో కోత కోసిన రైతులు వరిచేను వ్యర్థాలకు పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. మూడునాలుగేళ్ల ఈ ధోరణి బాగా పెరిగింది. అయితే నిప్పుతో పొలానికి ముప్పు తప్పదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

యంత్రాలతో కోతలు జరిగిన పొలంలోనే..

జిల్లాలో యంత్రాలతో వరిచేను కోతలు కోసిన రైతులు పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. కోత యంత్రం ద్వారా వరి చేను కోత కోసిన సమయంలో పొలంలో ఎక్కువ ఎత్తులో కోత చేస్తారు. కోసిన తర్వాత ధాన్యం రైతు ఇంటికి చేరుకోగా పంట వ్యర్థాలు (గడ్డి) పొలం నిండా పరుచుకుంటుంది. రబీలో పంట వేయాలంటే పొలంలో గడ్డి లేకుండా చేయాలి. ఆ గడ్డిని ఒక చోటకు చేర్చాలంటే రైతులకు అదనపు ఖర్చుతో కూడిన పని అవుతుంది. అందుకని పొలం నిండా పరుచుకున్న గడ్డికి నిప్పు పెట్టడం పరిపాటిగా మారిపోయింది. గడ్డికి నిప్పు పెట్టి పొలాన్ని దుక్కి, దమ్ము చేసిన తర్వాత రబీ పంటను వేసుకుంటున్నారు.

మిత్ర పురుగులకు హాని

రైతులు తీసుకుంటున్న నిర్ణయం కారణంగా రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు క్షీణిస్తున్నాయని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూమిపై పరుకున్న గడ్డిని కాల్చడం వల్ల భూమి పైపొరల్లో ఉండే మిత్ర పురుగులు మరణిస్తున్నాయని తెలియజేస్తున్నారు. భూమిలో ఉండే వానపాములు, ఇతర శిలీంద్రాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

కలియ దున్నడంతో నేలకు మేలు



ప్రతీ టన్ను వరిగడ్డి పెరగడానికి భూమి నుంచి 6.2 కిలోల నత్రజని, 1.1 కిలోల భాస్వరం, 18.9 కిలోల పొటాష్, కొద్ది మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరమవుతాయి. అందువల్ల ఈ వరి కొయ్యలను కలియ దున్నడం వల్ల ఈ పోషకాలన్నీ తిరిగి నేలను చేరుతాయి. లేదంటే పంట వ్యర్థాలను ముడిపదార్థాలుగా వాడుకొని కంపోస్టు పద్ధతి ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చుసుకోవచ్చు. వరి కోసిన వెంటనే మిగిలిన తేమను ఉపయోగించుకోవడం వల్ల వరికొయ్యలు మట్టిలో కలిసిపోయి కుళ్లిపోతాయి.

– కొర్ను సింహాచలం, మండల వ్యవసాయాధికారి, భామిని

రైతులు మారాలి



నాట్లు వేయడానికి ముందు దమ్ము చేసేటప్పుడు ఎకరాకు యాభై కిలోల సూపర్ పాస్ఫేట్ వేయడం వల్ల కొయ్యలు తొందరగా కుళ్లి సేంద్రియ పదార్థాలుగా మారుతాయి. వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కార్బన్ శాతం పెరగడమే కాకుండా, దిగుబడి 8 నుంచి 10 శాతం పెరిగినట్లు పరిశోధనల్లో తేలింది. భూ భౌతిక లక్షణాలు మెరుగుపడి పోషకాల లభ్యత పెరుగుతుంది. నేలలో కార్బన్ శాతం పెరగాలన్నా వ్యవసాయ వ్యర్థాలను తిరిగి నేలకు చేర్చడమే ఉత్తమ పద్ధతి.

– పెదపెంకి షణ్ముఖరాజు, డీపీఎం ఏపీసీఎన్ఎఫ్, కురుపాం